నమస్తే తెలంగాణ

# మెదక్

I హైదరాబాద్, గురువారం 19 జూన్ 2025 MEDAK


## రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి



- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : అర్హులైన రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. వానకాలం 2025 సీజన్‌కు సంబంధించి పంట పెట్టుబడి సాయం రైతుభరోసా కింద మెదక్ జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు 2,25,485 మంది రైతుల ఖాతాల్లో రూ.134.43 కోట్లు జమైనట్లు ఆయన తెలిపారు. DBT Failure అయిన రైతులు మరలా వారికి సంబంధించిన మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లి సంప్రదించాలని సూచించారు. జూన్ 5 లోపు కొత్తగా పట్టా పుస్తకం వచ్చిన వారు వారి పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం తీసుకొని సంబంధిత వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఈనెల 20లోపు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



లక్ష్మీగార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు, నాయకులు, అభిమానులు

## చివరి శ్వాస వరకు ప్రజల వెంట ఉంటా

- ఇప్పటి వరకు ఎలాంటి మచ్చ లేకుండా బతికా
- ప్రజల ఆశీర్వాదంతో కోలుకున్నా
- త్వరలో అందరినీ కలుస్తా
- ఆత్మీయ సమావేశంలో ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న వెన్నవరం భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 18 : అనారోగ్యం కారణంగా సుమారు పదినెలలుగా అన్ని కార్యక్రమాలకు దూరంగా ఉండి వైద్య చికిత్స తీసుకున్న ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి బుధవారం సన్నిహితులు, పార్టీ ముఖ్యనేతలు, అభిమానులతో లక్ష్మీగార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అందరితో ఆయన మాట్లాడుతూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యం కారణంగా ఎలాంటి కార్యక్రమాలకు రాలేకపోయానని తెలిపారు. భగవంతుడి దయ, ప్రజల ఆశీర్వాదంతో ఇప్పుడు ఆరోగ్యం కాస్త సహకరిస్తున్నదని, త్వరలో అందరినీ కలుస్తా అన్నారు.క్రియాశీలక రాజకీయాల్లో పాల్గొనే ఓపిక లేదని, రాజకీయంగా ఎదిగే వారికి తనవంతు సలహాలు, సూచనలు ఇస్తూ సహకరిస్తానని తెలిపారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రోజు నుంచి నేటి వరకు ఎక్కడా ఎలాంటి అవినీతి, ఆరోపణలు, రాజకీయ కక్షలు లేకుండా నీతివంతమైన రాజకీయాలు చేసినట్టు చెప్పారు. ఎవరితో ఎలాంటి శత్రుత్వం లేకుండా పార్టీ కోసం పనిచేసినట్లు తెలిపారు. రాజకీయాల్లో శత్రుత్వం మంచిది కాదని, ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఆర్సీపురం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి ఎమ్మెల్సీ, ప్రొటెం చైర్మన్‌గా బాధ్యతలు నూటికి నూరుశాతం విజయవంతంగా నిర్వర్తించానని భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆర్సీపురంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి 1200 మంది విద్యార్థులకు విద్యాబోధన అందించడం మనస్సుకు చాలా తృప్తిని ఇచ్చిందన్నారు. మూడు పుటల భోజనం దొరకని పేదలకు బువ్వ పెట్టాలనే ఆలోచన ఉన్నదని, దాని కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తన చివరి శ్వాస వరకు పేదలకు సేవచేస్తానని ఆయన వెల్లడించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు భూపాల్‌రెడ్డికి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, సోమిరెడ్డి, బాల్‌రెడ్డి, అంజయ్య, వెంకటేశం గౌడ్, కుమార్‌గౌడ్, రాములుగౌడ్, రవీందర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహ, పరమేశ్, అజీముద్దీన్, వెంకట్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల భూములపై సర్కారు కన్ను!

- అసైన్డ్ భూములను చెరబడుతున్న రేవంత్ సర్కార్
- పారిశ్రామిక పార్కుల పేరిట పేదలు, దళితుల భూములకు ఎసరు
- ఆరూర్‌లో 193 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్
- ప్రభుత్వం తీరుపై రైతుల ఆగ్రహం
- భూములు ఇచ్చేందుకు నిరాకరణ
- ఇటీవలే చెర్యాల్‌లో 120 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు నోటిఫికేషన్
- రెండువారాలు గడవకముందే ఆరూర్‌లో భూసేకరణకు మరో నోటిఫికేషన్
- త్వరలో కొండాపూర్, సంగారెడ్డి మండలాల్లో భూసేకరణ నోటిఫికేషన్..?
- ప్రభుత్వం తీరుపై దళిత, పేద రైతులు, ప్రతిపక్షాల ఆగ్రహం



సంగారెడ్డి,జూన్ 18(నమస్తే తెలంగాణ) : అసైన్డ్ భూములను రేవంత్ సర్కార్ చెరబడుతోంది. పేద రైతులు, దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను పారిశ్రామిక పార్కుల పేరిట తిరిగి లాక్కుంటున్నది. సంగారెడ్డి జిల్లా కంది మండలం చెర్యాల్‌లో పారిశ్రామిక పార్కు కోసం 120 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు ఇటీవలే సర్కార్ నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. తాజాగా సదాశివపేట మండలం ఆరూర్‌లో పారిశ్రామిక పార్కు పేరిట మరో 193 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. చెర్యాల్‌లో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి రెండు వారాలు గడవక ముందే, ప్రభుత్వం ఆరూర్‌లో భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేయడం గమనార్హం. త్వరలోనే కొండాపూర్, సంగారెడ్డి మండలాల్లో సైతం పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కోసం అసైన్డ్ భూములు సేకరించేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు తెలుస్తున్నది. కొండాపూర్ మండలంలో 200 నుంచి 300 ఎకరాలు, సంగారెడ్డి మండలంలో సైతం 200 ఎకరాలకు పైగా అసైన్డ్‌భూముల సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములపై పేద, దళిత, గిరిజన రైతులకు హక్కు లు కల్పిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ లు ఇచ్చింది. తీరా ఇప్పుడు సంగారెడ్డి జిల్లాలో వరుసగా పేద, దళిత రైతుల అసైన్డ్ భూములు పారిశ్రామిక పార్కుల పేరిట తిరిగి స్వాధీనం చేసుకోవడంపై అసైన్డ్ భూముల రైతులు, ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దశాబ్దాల క్రితం జీవనోపాధి కోసం పేదలు, దళిత, గిరిజనులకు ఇచ్చిన భూములను పారిశ్రామిక పార్కుల పేరిట తిరిగి తీసుకోవడం సరికాదని ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు. చెర్యాల్, ఆరూర్ గ్రామాల్లో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే, పంటలు పండే భూములను ప్రభుత్వం పరిశ్రమల కోసం సేకరించడంపై రైతులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూములు విలువ తక్కువగా ఉన్న, పరిశ్రమల ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తున్న నారాయణఖేడ్ లాంటి ప్రాంతంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటు చేయాలని, తద్వారా రైతులకు తక్కువ నష్టం జరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

### సంగారెడ్డి, కొండాపూర్ మండలాల్లో త్వరలో భూసేకరణ?

రేవంత్ సర్కార్ సంగారెడ్డి నియోజకవర్గంలోని అసైన్డ్ భూములపై కన్నేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశ్రామిక పార్కుల పేరిట అసైన్డ్‌భూముల సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వడంపై రైతులు, ప్రతిపక్షాల నేతలు మండిపడుతున్నారు. చెర్యాల, ఆరూర్‌లో అసైన్డ్‌భూముల సేకరణకు నోటిఫికేషన్లు జారీ కాగా, త్వరలో సంగారెడ్డి, కొండాపూర్ మండలాల్లో సైతం అసైన్డ్‌భూముల సేకరణకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో సర్వే నెంబరు 543లో సుమారు 200 ఎకరాలకుపైగా అసైన్డ్ భూమి ఉన్నట్లు సమాచారం. పారిశ్రామిక పార్కు పేరిట సర్వేనెంబరు 543లో 150 ఎకరాలకు పైగా అసైన్డ్‌భూములను సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. కొండాపూర్ మండలంలోని మునిదేవునిపల్లిలోని సర్వేనెంబరు 92లో సుమారు 400 ఎకరాల వరకు అసైన్డ్, ప్రభుత్వ భూమి ఉంది. సర్వేనెంబరు 92లో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ కంపెనీల ఏర్పాటుకు అసైన్డ్‌భూముల సేకరణకు ప్రభు త్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. కొం డాపూర్ మండలంలోని మాందాపూర్‌లో ని సర్వే నెంబరు 22లోని సైతం పరిశ్రమల కోసం అసైన్డ్‌భూముల సేకరణకు ప్రభు త్వం నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలు ఉన్న ట్లు తెలిసింది. సంగారెడ్డి నియోజకవర్గం లో అసైన్డ్‌భూముల సేకరణ వెనుక జిల్లాకు చెందిన కాంగ్రెస్ కీలక నాయకుడి హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

### అరూర్‌లో 193 ఎకరాలపై కన్ను

కాంగ్రెస్ సర్కార్ పారిశ్రామిక పార్కుల పేరిట సంగారెడ్డి జిల్లాలో జాతీయ రహదారులకు సమీపంలోని విలువైన అసైన్డ్ భూముల సేకరణకు నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. ఇటీవల కంది మండలం చెర్యాల్‌లో హైదరాబాద్-ముంబై హైవేకు సమీపంలో సర్వేనెంబరు 741లోని 120 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఐఐటీ హైదరాబాద్‌కు సమీపంలోని విలువైన, పంటలు పండే భూములు ఇచ్చేందుకు దళిత, పేద రైతులు నిరాకరిస్తున్నారు. దీంతో భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇది ఇలా ఉండగానే ప్రభుత్వం పారిశ్రామిక పార్కు పేరిట బుధవారం సదాశివపేట మండలం ఆరూర్‌లోని హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారికి సమీపంలోని 193.14 ఎకరాల అసైన్డ్‌భూముల సేకరణకు నోటిఫికేషన్ జారీచేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. దశాబ్దాల క్రితం 134 మంది దళిత, పేద రైతులకు ఇచ్చిన 193.14 ఎకరాల అసైన్డ్ భూములను పారిశ్రామిక పార్కు కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. సర్వే నెంబరు 224లో 44 ఎకరాలు, సర్వే నెంబరు 263లో 80.34 ఎకరాలు, సర్వే నెంబరు 268లో 68.20 ఎకరాల అసైన్డ్ భూములను పరిశ్రమల కోసం ప్రభుత్వం సేకరించనున్నది. ప్రభుత్వం సేకరించ తలపెట్టిన భూములు పంటలు పండేవి. అలాగే ఈ భూముల విలువ ఎకరం రూ. కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పలుకుతున్నాయి. ఇంత విలువైన భూములను అప్పనంగా అప్పగించేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారికి ఇరు పక్కల పెద్దల భూములు ఉన్నప్పటికీ, వాటి జోలికి వెళ్లకుండా పేద రైతులకు ఇచ్చిన అసైన్డ్‌భూములను మాత్రమే ప్రభుత్వం సేకరించే ప్రయత్నం చేయడంపై రైతులు రగిలిపోతున్నారు.

## సీనియర్ ఫోక్ కళాకారులను ఆదుకోవాలి

- తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్



కొండపోచమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పత్తిపాటి రమణాకర్

జగదేవపూర్, జూన్ 18 : తెలంగాణలో 30 ఏండ్లుగా పనిచేస్తున్న సీనియర్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ కోరారు. బుధవారం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కార్యనిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర ఆవిర్భావంలో కీలక భూమిక పోషించినట్లు గుర్తుచేశారు. ఎంతోమంది సీనియర్ కళాకారులు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందలేదన్నారు. ఇక నుంచి ప్రతినెలా ప్రతి జిల్లాకేంద్రంలో కళాకారులు అందరితో సభలు నిర్వహిస్తామన్నారు. తమకు ప్రభుత్వం హైదరాబాద్‌లో 500 గజాల స్థలం ఇవ్వాలని, వడ్డీలేని రుణాలు అందించాలని, వృద్ధ కళాకారులకు పెన్షన్ అందించాలని విజ్ఞప్తి చేశారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, కళాకారులకు గుర్తింపు కార్డులు అందించి, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్‌బాయ్, కోశాధికారి గజ్వేల్ వేణు, ఉపాధ్యక్షుడు జీఎల్ నాందేవ్, సలహాదారులు దరువు అంజన్న, వరంగల్ శ్రీను, జంగిరెడ్డి, కోదాడశ్రీను, రాజేశ్, రమేశ్, బాబు, ప్రసాద్, మల్లిక్‌తేజ, మల్లం మధు, బాబుశాస్త్రి, వినోద్, పాల్గొన్నారు.







### శిథిల భవనాల్లో చదువులు..

సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలంలోని ఎద్దునూరు గ్రామ ప్రాథమిక పాఠశాలలో సమస్యలు నెలకొన్నాయి. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. పరిసరాల్లో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

-సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, జూన్ 18



## పీఎంశ్రీ నిధుల దుర్వినియోగం?

- కౌడిపల్లి మండలంలో పలు పాఠశాల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు
- జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని పలువురి డిమాండ్

కౌడిపల్లి, జూన్ 18: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజిరంపేట ప్రాథమిక పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ పాఠశాలకు పేజ్-1 కింద రూ.10 లక్షల నిధులు పీఎంశ్రీ పథకం ద్వారా మంజూరయ్యారు. రెండో విడతలో పేజ్-2 కింద కౌడిపల్లి బాలుర ఉన్నత పాఠశాలకు రూ. 7.95 లక్షల నిధులు మంజూరయ్యాయి. బుజిరంపేట ప్రాథమిక పాఠశాలలో అధిక మొత్తంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులను ఫీల్డ్ విజిట్, టూర్‌కు తీసుకెళ్లేందుకు తక్కువ వ్యయం చేసి, ఎక్కువ నిధులు ఖర్చుచూపెట్టి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులను ఫీల్డ్ విజిటింగ్ నిమిత్తం బుజిరంపేట నుంచి మెదక్ చర్చికి బస్సులో తీసుకెళ్లినందుకు రూ.86,500 ఖర్చు అయినట్లు లెక్క చూపించి చెక్కును హెచ్‌ఎం తండ్రి పేరున రాసిచ్చినట్లు తెలిసింది. ఫీల్డ్ విజిట్ నిమిత్తం తునికిలోని రామానాయుడు విజ్ఞాన జ్యోతి విద్యాసంస్థలకు డీసీఎంలో విద్యార్థులను తీసుకెళ్లినందుకు రూ.46వేలు ఖర్చు చూపించారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియాన్ని చూపించడానికి బస్సులో తీసుకెళ్లినందుకు రూ.49వేలు ఖర్చుచేసినట్లు లెక్కలు చూపించారు. సామాజిక విద్యా అవగాహనపై విద్యార్థులకు ఆట వస్తువులు, స్టేషనరి కొనుగోలుకు దాదాపు రూ.30 వేలు ఖర్చుచేశారు. విద్యార్థికి రూ.500 చొప్పున రూ.68వేలు ఖర్చు చేసినట్లు చూపించారు. పీఎంశ్రీ పథకం కింద రూ.10 లక్షలు మంజూరైతే రూ.8లక్షల ఖర్చు చూపించి పాఠశాల ప్రాంగణంలో శాశ్వత ఆట వస్తువుల నిర్మాణానికి రూ.2లక్షలు ఖర్చు చేయకుండా బ్యాంకు ఖాతాలో ఉంచినట్లు తెలిసింది. కౌడిపల్లి బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇద్దరు ఆయాలను నియమించి వారికి సగం చొప్పున వేతనాలు చెల్లించి, మిగతా సగం వేతనాలు తన భర్త ఖాతాలో జమచేసిన విషయం మీడియా ద్వారా వెలుగుచూసింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పీఎంశ్రీ నిధుల వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయపై బుజిరంపేట హెచ్‌ఎంను 'నమస్తే తెలంగాణ'వివరణ కోరగా.. తమ పాఠశాలకు రూ.10లక్షల నిధులు మంజూరు కాగా, రూ.8.08 లక్షలు ఖర్చుచేశామని, మిగతా డబ్బులు బ్యాంకు ఖాతాలో ఉన్నట్లు తెలిపారు.




## బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



బేగంపేటలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి, జూన్ 18: సిద్దిపేట జిల్లా మండల కేంద్రం బెజ్జంకి నుంచి బేగంపేట వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతూ బేగంపేట గ్రామస్తులు బుధవారం గ్రామంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చింతలపల్లి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల జాప్యంతో కంకర తేలి, బురద గుంతలు, దుమ్ము, ధూళితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తున్నదని, చాలా చోట్ల రోడ్డు దెబ్బతిని ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, శేఖర్‌బాబు, నరేశ్, మోహన్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, సంపత్, రవి, వెంకట్, మల్లయ్య, కనకయ్య, మధు, చంద్రం, లింగయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకర్ నీటితో తడులు



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరంలో ట్యాంకర్‌తో పత్తి గింజలకు నీళ్లు పడుతున్న రైతు కరుణాకర్

అక్కన్నపేట,జూన్18: వానకాలం మొదలైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. మృగశిర కార్తె ఏల్లుదాలకు వస్తున్న వానలు పడకపోవడంతో రైతులు మొగులు వైపు చూస్తున్నారు. పునాస పంటలతో పాటు వరి, మక్క, పత్తి పంటలు సాగు చేయలేక రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవక, భూగర్భ జలాలు వృద్ధి చెందక పోవడంతో బావులు, బోర్లలో నీటి ఊటలు లేకుండా పోయాయి. రైతులు బావుల్లో, బోరుల్లో కొద్దో గొప్పో నీళ్లతో నారుమడులు పారిస్తున్నారు. దీనికి తోడూ రాత్రిపూట కరెంట్ సరిగా ఇవ్వకపోవడంతో ఎవుసం మళ్లీ వెనక్కిపోయే పరిస్థితులు దాపురించాయి.

### కాలం ఆగంజేస్తున్నది..



రెండెకరాల్లో పత్తి గింజలు పెట్టిన. వానలు పడక పోవడంతో గింజలు మాడిపోతాయని ట్యాంకర్‌తో నీళ్లు తెచ్చి తడుపుతున్న. పోసిన నీళ్లు పోసినట్టే భూమిలోకి ఇంకుతున్నయ్. ఇగ చేతి పంపుతో గింజలపై నీళ్లతో స్ప్రే చేయాలనే ఆలోచనకు వచ్చిన. రూ.1200లకు ఒక్కటి చొప్పున 8 పత్తి ప్యాకెట్లు తెచ్చిపెట్టిన. దుక్కి, కూలీలు, పత్తి గింజలు అన్నీ కలిపి సుమా రు రూ. 30 వేల వరకు పెట్టుబడి పెట్టి మునిగిన. నిరుడు గీ కార్తెలో వానలు ఫుల్‌గా పడ్డయ్. ఈసారి కాలం ఆగంజేస్తున్నది.

- పొన్న కరుణాకర్, రైతు, రామవరం,

### పల్లెల్లో సమస్యల తిష్ట..

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. కేంద్రం నుంచి గ్రాంట్స్, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రత్యేకాధికారులు నిధుల లేమితో ఎలాంటి పనులు చేయలేకపోతున్నారు. దీంతో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సర్పంచులు ఉంటే పనులు చేయించేవారు, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం అటకెక్కింది. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. డంపుయార్డులు, వైకుంఠధామాలు, నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, మొక్కల పెంపకం నిర్వహణ గాలికి వదిలేశారు. జీపీకి కేటాయించిన చెత్త సేకరణ ట్రాక్టర్లు, ట్రాలీలు మూలుగుతున్నాయి. చాలా గ్రామాల్లో డ్రైనేజీలు నిండి మురుగు రోడ్లపైన పారుతున్నది. వర్షం పడితే మురుగు, వర్షం నీరు కలిసి రోడ్లపైకి చేరి దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలతో తాగునీరు కలుషితం జరుగుతున్నది. గ్రామాల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామంలో డ్రైనేజీల్లో పందులు తిరుగుతున్న దృశ్యాలు బుధవారం 'నమస్తే తెలంగాణ' ఫొటోలు బంధించింది.

-నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా (జూన్ 18)



సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లిలో డ్రైనేజీల్లో సంచరిస్తున్న పందులు



## సార్లూ.. జర ఇటు చూడరూ



పిల్లుట్ల ప్రాథమిక పాఠశాలలో దెబ్బ తిన్న భవనం

శివ్వంపేట, జూన్ 18 : మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల ప్రాథమిక పాఠశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం 'మనఊరు-మనబడి' పథకం మొదటి విడతగా ఎంపిక చేసింది. అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఏడాది క్రితం పాఠశాల పక్కనే భారీచెట్టు కూలి పాఠశాలపై పడింది. దీంతో రెండు గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇప్పటి వరకు అధికారులు వాటికి మరమ్మతులు చేయించక పోవడం శోచనీయం. వర్షాకాలం కాబట్టి వానలు కురిస్తే గోడలు నాని కూలిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే బాగుచేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని కొంతాన్‌పల్లి జిల్లాపరిషత్ పాఠశాలకు ప్రధాన గేటు ఏర్పాటు లేపోవడంతో రాత్రివేళల్లో ఆకతాయిలకు అడ్డాగా మారి అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొంతాన్‌పల్లి పాఠశాలకు ప్రధాన గేటు లేని దృశ్యం